క్లుప్తంగా

కేజేపురంలో సంక్రాంతి వేడుకలు

మాజీ ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీ

మాడుగుల రూరల్ : ప్రతి ఏటా వలే ఈ ఏడాది కూడా సంక్రాంతి పండగకు తన స్వగ్రామం అయిన కె.జె.పురం గ్రామంలో కార్యకర్తలకు, నాయకులు, అభిమానులకు, పార్టీ ప్రజా ప్రతినిధులకు అందుబాటులో ఉంటానని చోడవరం మాజీ ఎమ్మెల్యే, మాజీ ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీ శనివారం సాయంత్రం విడుదల చేసిన ప్రకటనలో పేర్కొన్నారు. భోగి, సంక్రాంతి, కనుమ పండగను కె.జె.పురంలో కుటుంబ సభ్యుల మధ్య జరుపుకొంటానని తెలిపారు. ఈ సంక్రాంతి అందరిలో, ఆనందాన్ని, సంతోషాన్ని నింపాలని ఆకాంక్షిస్తున్నట్టు తెలిపారు.

కోడిపందాలు, పేకాటలు వద్దు


గొలుగొండ ఎస్ఐ రామారావు

గొలుగొండ: గొలుగొండ పోలీస్ స్టేషన్ పరిధిలో ఉన్న గ్రామాల్లో సంక్రాంతి సందర్భంగా పేకాట, కోడిపందాలు, గుళ్లాటలు నిర్వహిస్తే కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని గొలుగొండ ఎస్ఐ రామారావు తెలిపారు. ఆయన విలేకర్లతో మాట్లాడుతూ సంక్రాంతి సందర్భంగా ఇటువంటి కార్యక్రమాలు నిర్వహించొద్దని హెచ్చరించారు. ఇప్పటికే గ్రామాల్లో ప్రధాన పార్టీ నేతలకు, గతంలో పనిచేసిన నిర్వాహకులకు సూచనలు చేసినట్టు చెప్పారు.

అంగన్‌వాడీ కేంద్రంలో ముందస్తు సంక్రాంతి వేడుకలు


సంక్రాంతి సంబరాల్లో చిన్నారుల వేషధారణలు

మాడుగుల రూరల్ : మండలంలో కె.జె.పురం 1 వ అంగన్‌వాడీ కేంద్రంలో ముందస్తు సంక్రాంతి వేడుకలు శనివారం నిర్వహించారు. అంగన్‌వాడీ కార్యకర్త పి. చంద్ర ఆధ్వర్యంలో చిన్నారులను హరిదాసు వేషధారణ వేయించారు. గాలిపటాలు ఎగరవేయించారు. దీంతో పాటు భోగి మంటలు వేసి, తెలుగుదనం ఉట్టిపడేలా సంప్రదాయ సిద్ధంగా సంక్రాంతి పండగను కేంద్రంలో నిర్వహించారు. చిన్నారుల తల్లిదండ్రులు, బాలింతలు గర్భిణులతో పాటు స్థానిక అంగన్‌వాడీ ఆయా నూకరత్నం, గ్రామస్తులు సంక్రాంతి సంబరాలు వీక్షించారు.

విస్తారంగా కర్ర పెండలం సాగు


యరకన్నపాలెంలో సాగులో ఉన్న కర్రపెండలం పంట

కె.కోటపాడు : మండలంలో మెట్ట ప్రాంత గ్రామాల్లో కర్ర పెండలం పంటను రైతులు అధిక విస్తీర్ణంలో సాగు చేపడుతున్నారు. ప్రధానంగా ఈ పంట సాగుకు గరువు భూములు ఉపకరిస్తాయి. తక్కువ నీటి సాంద్రతతో భూ అంతరభాగంలో పండే పంట కావడం వల్ల మార్కెట్‌లో కర్రపెండలం దుంపలకు మంచి డిమాండ్‌తో పాటు ధర పలకడంతో సాగుకు మొగ్గు చూపిస్తున్నారు. గరుగుబిల్లి, చౌడువాడ, గుల్లేపల్లి, యరకన్నపాలెం, దాలివలస, సింగన్నదొరపాలెం, డి.అగ్రహారం, కొరువాడ గ్రామాల్లో 150 ఎకరాల్లో ఈ పంటను రైతులు సాగు చేస్తున్నారు. మరో పది రోజుల్లో పంట దిగుబడి వస్తుందన్నారు.

నేడు నవోదయ మోడల్ పరీక్ష

చోడవరం రూరల్: పీఆర్‌టీయూ చోడవరం మండల శాఖ ఆధ్వర్యంలో ఆదివారం(నేడు) నవోదయ విద్యాసంస్థల్లో ప్రవేశాన్ని ఆశించే విద్యార్థుల సౌకర్యార్థం మోడల్ ఎంట్రన్స్ పరీక్షను నిర్వహించనున్నట్టు మండల పీఆర్‌టీయూ అధ్యక్షుడు పి.వి.స్వామి తెలిపారు. శనివారం ఆయన విడుదల చేసిన ప్రకటనలో స్థానిక ఆడమ్స్ పబ్లిక్ స్కూల్‌లో ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు పరీక్ష ఉంటుందని, ఆసక్తి గల విద్యార్థులు బాల్ పాయింట్ పెన్ను, పెన్సిల్ వంటి పరీక్షకు అవసరమయ్యే సామగ్రితో రావాల్సిందిగా ఆయన కోరారు.

ఈ రోడ్ల సొగసు చూడతరమా!



బుచ్చెయ్యపేట : మండల ప్రధాన రోడ్లుపై ప్రయాణం నకరంగా మారింది. భీమునిపట్నం ,నర్సీపట్నం(బీఎన్) రోడ్డు, రాజాం నుంచి తట్టబంద వెళ్లే(ఆర్టీ) రోడ్డు, రాజాం వెదుళ్లగెడ్డ నుండి గున్నెంపూడి వెళ్లే రోడ్డు,పెదమదీన జంక్షన్ నుండి చింతపాక వెళ్లే రోడ్డు, గున్నెంపూడి రోడ్డు నుండి చిన మదీనకు వెళ్లే రోడ్డు తదితర గ్రామాల రోడ్లు పెద్దపెద్ద గోతులు పడి అధ్వానంగా తయారయ్యాయి. ప్రజలు రాకపోకలకు తీవ్ర అవరోధాలు ఎదురవుతున్నాయి. పలు గ్రామాల వద్ద తారు మొత్తం ఊడిపోయి మట్టి రోడ్లను తలపించగా రెండు నుండి మూడు అడుగుల మేర గోతులు పడి పలువురు వాహనాలు ప్రమాదాలకు గురౌవుతున్నారు. పలు గ్రామాల వద్ద ఇళ్లల్లో వాడుక నీరు రోడ్లపైకి వచ్చి బురద రోడ్లుగా మారి వాహనాలు అదుపుతప్పి జారుతున్నాయి. మట్టి రోడ్లుపై దుమ్ము ధూళితో పలువురు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. గతంలో ఊర్లో ఉండి ఉపాధి, ఉద్యోగాల కోసం బయటకెళ్లి సంక్రాంతి పండగకు తమ సొంత గ్రామాలకు తిరిగొస్తున్న పలువురు తమ గ్రామ రోడ్లు దుస్థితి చూసి నివ్వరపోతున్నారు. పట్టణ ప్రాంతాల్లో ఉండి పల్లె గ్రామాలకు కుటుంబాలతో కార్లు,బైక్‌లపై పండగకి వస్తున్న తమ కుటుంబ సభ్యులను రాత్రిపూట రావొద్దని, మన గ్రామ రోడ్లు పరిస్థితి ఏమీ బాగోలేదని, పగలే నెమ్మదిగా రావాలంటూ ముందుగానే సమాచారం అందిస్తున్నారు. అధికారంలోకి వచ్చిన వెంటనే రోడ్లు బాగు చేస్తామని,సంక్రాంతి పండగకు ముందే రోడ్లన్నీ బాగు చేస్తామని హామీలు గుప్పించిన కూటమి ప్రభుత్వ నాయకుల మాటలు ఎక్కడా ఆచరణలో కనిపించలేదు. ఎంపీ సీఎం రమేష్, ఎమ్మెల్యే కె.ఎస్.ఎన్.ఎస్ రాజులు రోడ్లును బాగు చేస్తామని హామీ ఇచ్చిన అమలు కాకపోవడంపై పలు గ్రామాల ప్రయాణికులు, ప్రజలు ఆగ్రహం చెందుతున్నారు. సంక్రాంతి పండగ సమయంలో ఆయా గ్రామాల్లో జరిగే తీర్థ మహోత్సవాలు, పండగలకు ఉత్సాహంగా పలు గ్రామాలకు వాహనాలపై రాకపోకలు సాగించే ప్రయాణికులకు ఏమైనా ప్రమాదాలు జరిగితే ఎవరు బాధ్యత వహిస్తారని మండల ప్రజలు ప్రశ్నిస్తున్నారు. తక్షణం రోడ్ల దుస్థితిపై చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.


తారు మొత్తం ఊడిపోయి మట్టి రోడ్డును తలపిస్తున్న తురకలపూడి తారు రోడ్డు


శింగవరం వద్ద రోడ్డు మధ్య పెద్ద గొయ్యి

రోలుగుంటలో క్రికెట్ పోటీలు

రోలుగుంట : స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాలలో రోలుగుంట ప్రీమియర్ లీగ్ ఆధ్వర్యంలో సంక్రాంతి సందర్భంగా శనివారం క్రికెట్ పోటీలను నిర్వహించారు. నిర్వాహకులు ఐపీఎల్ తరహాలో ఈ పోటీలను ఏర్పాటు చేయగా తొలిరోజు గ్రామానికి చెందిన ఆరు జట్లు ఉత్సాహంగా పాల్గున్నాయి. సిండా లెవన్ టీంతో రామసేనతో జరిగిన పోటీల్లో రామసేన్ టీం విజయం సాధించింది. తరువాత వినాయక వారియర్ టీంతో వినాయక స్ట్రింగ్ టీంతో జరిగిన పోటీల్లో వినాయక వారియర్ టీం విజయం సాధించింది. ఈ సందర్భంగా నిర్వాహకులు మూడు రోజుల పాటు ఈ పోటీలు నిర్వహిస్తామని, పోటీలో పాల్గొనేందుకు ఉత్సాహం గల జట్లు నిర్వాహకులను సంప్రదించాలని కోరారు. విజేతలకు ముగింపు రోజు బహుమతి ప్రదానం జరుగుతుందని తెలిపారు.


జెడ్పీ హైస్కూల్ మైదానంలో క్రికెట్ ఆడుతున్న క్రీడాకారులు

పుణ్యకోటి వాహనంపై తిరువీధి సేవలు


పుణ్యకోటి వాహనంపై స్వామివారి తిరువీధి సేవలు నిర్వహిస్తున్న దృశ్యం


పుష్పతోటలో గోదాదేవి అమ్మవారికి పూజలు నిర్వహిస్తున్న దృశ్యం

నక్కపల్లి : ప్రముఖ పుణ్యక్షేత్రం ఉపమాక వేంకటేశ్వర స్వామి ఆలయంలో ధనుర్మాస అధ్యయనోత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి. ముక్కోటి ఏకాదశి వరకు పగటి పూట మాత్రమే స్వామివారికి తిరువీధి సేవలు నిర్వహించేవారు. శనివారం నుంచి రాపత్తు అధ్యయనోత్సవాలు కూడా ప్రారంభం కావడంతో పగలు, రాత్రికూడా స్వామివారికి తిరువీధి సేవలు నిర్వహించడం జరుగుతుందని ప్రధానార్చకులు గొట్టుముక్కల వరప్రసాదాచార్యులు తెలిపారు. ఈ కార్యక్రమాల్లో బాగంగా శనివారం ఉదయం కొండపై స్వామివారి మూలవిరాట్‌కు నిత్యార్చనలు, పూజలు నిర్వహించారు. దిగువ ఉత్సవమూర్తులకు, క్షేత్రపాలకుడు వేణుగోపాలస్వామివారికి, గోదాదేవి అమ్మవారి నిత్యపూజలు నిర్వహించిన అనంతరం శ్రీదేవీ, భూదేవీ సమేత శ్రీవేంకటేశ్వర స్వామివారిని పుణ్యకోటి వాహనంపైన, గోదాదేవి అమ్మవారిని పల్లకిలో ఉంచి మాడవీధుల్లో తిరువీధి సేవలు నిర్వహించారు. స్వామివారి పుష్ప తోటలో గోదాదేవి అమ్మవారిని తీసుకెళ్లి పూజలు నిర్వహించారు. అనంతరం గోదాదేవి సన్నిధిలో తిరుప్పావై పాశురాలతో నీరాజన మంత్రపుష్పాలు సమర్పించారు. రాపత్తు అధ్యయనోత్సవాల్లో భాగంగా రాత్రి స్వామివారికి నిత్య పూజలు, సాయంకాలారాధనలు నిర్వహించి స్వామి వారికి, అమ్మవారికి తిరువీధి సేవలు నిర్వహించారు. ఈ కార్యక్రమాల్లో అర్చక స్వాములు కృష్ణమాచార్యులు, శేషాచార్యులు, గోపాలాచార్యులు, సాయి ఆచార్యులు, రాజగోపాలాచార్యులు దేవస్థానం సిబ్బంది పాల్గొన్నారు. పండగ సెలవులు కావడంతో స్వామివారిని దర్శించుకునేందుకు వివిధ ప్రాంతాల నుంచి భక్తులు తరలివచ్చారు.

త్వరలో రైతు బజార్‌ను అందుబాటులోకి తెస్తాం

చోడవరం : పట్టణంలోని రైతుబజార్ షాపింగ్ కాంప్లెక్స్ సముదాయం వేగంగా నిర్మించి ప్రజలకు అందుబాటులోకి తెస్తామని ఎమ్మెల్యే కె.ఎస్.ఎన్.ఎస్ రాజు అన్నారు. గతంలో అసంపూర్తిగా నిలిచిపోయిన రైతుబజార్ షాపింగ్ కాంప్లెక్స్ శ్లాబ్ నిర్మాణం పనులకు శనివారం ఆయన పూజ చేసి ప్రారంభించారు. అనంతరం రేవళ్ల, మైచర్లపాలెం, కన్నంపాలెం గ్రామాల్లో నిర్మించిన సీసీ రోడ్లు, కాల్వలను ఎమ్మెల్యే ప్రారంభించారు. ఎన్ఆర్ఈజీఎస్ నిధులతో చేపట్టిన సీసీ రోడ్లు, కాల్వలను వెంటనే అన్ని గ్రామాల్లో పూర్తి చేయాలని, అందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని స్థానిక నాయకులను, అధికారులను ఎమ్మెల్యే ఆదేశించారు. నిధులు వృధా కాకుండా చూడాలన్నారు. అవసరమైన చోట్ల అన్నీ రోడ్లు కాల్వలు నిర్మించేందుకు చర్యలు తీసుకున్నామన్నారు. చోడవరం పట్టణంలో అసంపూర్తిగా నిలిచిపోయిన రైతు బజార్ పనులు పూర్తి చేసి పూర్తిస్థాయిలో బజార్‌ను ప్రజలకు అందుబాటులోకి తెస్తామని చెప్పారు. ఈ కార్యక్రమంలో మాజీ జెడ్పీటీసీ కనిశెట్టి మచ్చిరాజు, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ మజ్జి గౌరీశంకర్, వైస్ ఎంపీపీ బైన ఈశ్వరరావు, గవర కార్పొరేషన్ డైరెక్టర్ బొడ్డేడ గంగాధర్, బుజ్జి , ఈఓఆర్‌డి మహేష్, పీఆర్ డీఈఈ ప్రసాద్ పాల్గొన్నారు.


మైచర్లపాలెంలో అభివృద్ధి పనులను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే రాజు

వైఎస్సార్‌సీపీ నాయకుడికి మాజీ డిప్యూటీ సీఎం బూడి పరామర్శ

దేవరాపల్లి: రోడ్డు ప్రమాదంలో గాయపడిన రైవాడ గ్రామానికి చెందిన మండల వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు, రిటైర్డ్ వీఆర్‌వో కె.ఎస్. అప్పలనాయుడును మాజీ డిప్యూటీ సీఎం, వైఎస్సార్‌సీపీ అనకాపల్లి జిల్లా అధ్యక్షుడు బూడి ముత్యాలనాయుడు పరామర్శించారు. ఈ మేరకు రైవాడలోని కె.ఎస్. అప్పలనాయుడు ఇంటికి శనివారం చేరుకొని ఆయన ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. త్వరగా కోలుకోవాలని ఆయన ఆకాంక్షించారు. వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు బాబూరావు, మండల ప్రధాన కార్యదర్శి లలితానాయుడు, జేసీఎస్ మండల కన్వీనర్ కె.వి.రమణ, స్థానిక సీనియర్ నాయకుడు చల్లా నాయుడు, కొరుపోలు శ్రీను, గంగంవంశం సంతోష్, బొబ్బిలి రాము తదితరులు అప్పలనాయుడును పరామర్శించారు.


అప్పలనాయుడును పరామర్శిస్తున్న మాజీ డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు

రామాలయానికి స్టీలు కంచాల వితరణ

మాడుగుల రూరల్ : మండలంలో కె.జె.పురం రామాలయచానికి గ్రామానికి చెందిన గునుపూడి రామన్న కుమారులు నాగేశ్వరావు, విఘ్నేశ్వరావు ఆర్థిక సహకారంతో శనివారం రాత్రి 61 స్టీలు కంచాలు అందజేవారు. ప్రతి శనివారం ఆలయంలో జరిగే చద్ది కార్యక్రమానికి ఉపయోగించడానికి ఈ స్టీలు కంచాలను స్థానిక ఎంపీటీసీ సభ్యులు భీశెట్టి శ్రీనివాసరావు చేతుల మీదుగా అందజేశారు. కార్యక్రమంలో ఆలయ అర్చకులు వెంకటరమణ పాల్గొన్నారు.


కె.జె.పురం రామాలయంలో స్టీలు కంచాలు అందజేస్తున్న దాత నాగేశ్వరావు

కోడిపందాలు నిర్వహిస్తే కేసులు

మాకవరపాలెం : సంక్రాతి సందర్భంగా కోడి పందాలు, పేకాట నిర్వహిస్తే కేసులు తప్పవని ఎస్ఐ దామోదర్‌నాయుడు హెచ్చరించారు. ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో జరిగే తీర్థమహోత్సవాల్లో పేకాట, కోడి పందాలు, గుళ్లాటలు నిర్వహిస్తే చర్యలు తీసుకుంటామన్నారు. ఎక్కడైనా నిర్వహిస్తే ఆయా గ్రామాల పెద్దలు బాధ్యత వహించాల్సి ఉంటుందన్నారు.

అసాంఘిక కార్యకలాపాలు నిర్వహిస్తే చర్యలు


మాట్లాడుతున్న ఎస్ఐ భీమరాజు

నాతవరం : సంక్రాంతి పండగ సందర్భంగా కోడి పందాలు, పేకాటలు నిర్వహించరాదని నాతవరం ఎస్ఐ సిహెచ్.భీమరాజు అన్నారు. ఆయన శనివారం విలేకరులతో మాట్లాడుతూ జిల్లా ఎస్పీ తుహిన్ సిన్హా ఆదేశాల మేరకు పండగ సమయాల్లో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ప్రత్యేక దృష్టి సారించామన్నారు. ఇప్పటికే గ్రామాల్లో పోలీసు బృందం పర్యవేక్షణ ఉందన్నారు. అసాంఘిక శక్తులను నివారించేందుకు రాజకీయాలకు అతీతంగా అందరూ సహకరించాలన్నారు. గ్రామాల్లో దండోరా ద్వారా పోలీసు హెచ్చరికలు చేశామన్నారు.

భక్తిశ్రద్ధలతో మేలుకొలుపు


చౌడువాడ గవరపేటలో మేలుకొలుపులు

కె.కోటపాడు : ధనుర్మాసం సందర్భంగా చౌడువాడ గ్రామంలో గవరపేటలో గల సీతారామాంజనేయ స్వామి ఆలయ అభివృద్ధి కమిటీ సభ్యులు మేలుకొలుపు కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. రామాలయం, ఆంజనేయస్వామి ఆలయాల్లో మేల్కొలుపు కార్యక్రమం జరిపి దేవతామూర్తుల ఉత్సవ విగ్రహాలను ప్రత్యేక భజనలతో భక్తులు ఇంటింటికి వెళ్లి భజన కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. భోగి పండగ వరకూ ఈ కార్యక్రమాన్ని ప్రతిరోజూ భక్తిశ్రద్ధలతో జరపనున్నట్టు తెలిపారు. ఈ కార్యక్రమాల్లో 100 మంది భక్తులు ప్రతి రోజూ పాల్గొంటున్నారు.

రామాలయంలో ప్రత్యేక పూజలు

మాకవరపాలెం: మండల కేంద్రంలోని రామాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ధనుర్మాసం సందర్భంగా శనివారం ఉదయం స్థానిక మహిళలు గ్రామంలో నగర సంకీర్తన చేశారు. అనంతరం వారంతా కిందివీధిలో ఉన్న రామాలయానికి చేరుకుని ప్రత్యేక పూజలు చేశారు. భోగి వరకు నిత్యం పూజలు చేస్తామని నిర్వాహకురాలు రత్నమాల తెలిపారు.

మండల దళిత ఐక్యవేదిక సమావేశం నేడు

దేవరాపల్లి : దేవరాపల్లిలో ఆదివారం మండల దళిత ఐక్యవేదిక సమావేశాన్ని నిర్వహిస్తున్నట్టు మండల నాయకుడు కాటపల్లి అప్పారావు శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. స్థానిక అంబేద్కర్ కాలనీ సమీపంలోని సన్యాసమ్మ అమ్మవారి ఆలయ ఆవరణలో ఆదివారం మధ్యాహ్నం రెండు గంటలకు ఈ సమావేశం జరుగుతుందన్నారు. ఈ సమావేశానికి మండలంలోని అన్ని గ్రామాల దళిత సంఘాల నాయకులు పాల్గొని విజయవంతం చేయాలని మండల నాయుకుడు కాటపల్లి అప్పారావు కోరారు.

పోస్టుఫీసు సిబ్బందికి సంక్రాంతి పోటీలు


కె.జె.పురంలో పోస్టల్ సిబ్బంది కుర్చీ ఆట ఆడుతున్న దృశ్యం

మాడుగుల రూరల్ : సంక్రాంతి సంబరాలు కార్యక్రమంలో భాగంగా, కె.జె.పురం సబ్ పోస్టుఫీసు పరిధిలో గల సిబ్బంది శనివారం సాయంత్రం నిర్వహించిన వివిధ పోటీల్లో పాల్గొన్నారు. కె.జె.పురం సబ్ పోస్టుమాస్టర్ కె.సుదీర్ ఆధ్వర్యంలో, బ్రాంచి పరిధిలో గల 13 బ్రాంచి పోస్టుఫీసుల్లో పనిచేస్తున్న సిబ్బందికి కబడ్డీ, కుర్చీ ఆట, అంత్యాక్షరి, క్విజ్ పోటీలు నిర్వహించారు. విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో పాలకుర్తి రాంజీ పాల్గొన్నారు.

కాలినడకన సింహాద్రప్పన్న దర్శనానికి...

మాడుగుల రూరల్ : సింహాద్రప్పన్న మాలాధారణ భక్తులు కె.జె.పురం గ్రామం నుంచి కాలినడకన సింహాచలం శనివారం సాయంత్రం బయలుదేరి వెళ్లారు. గ్రామంలో ప్రతి ఏటా ధనుర్మాసంలో స్వామి వారి మాలాధారణ వేసి భోగి పండగకు ముందు స్వామి వారిని కాలినడకన వెళ్లి దర్శించుకోవడం అనవాయితీగా వస్తుంది. ఈ గ్రామంలో 2006 సంవత్సరం నుంచి స్వామి వారి మాలాధారణ వేస్తున్నారు. 2009 నుంచి కాలినడకన సింహచలం బయలుదేరి వెళ్తున్నారు. 36 మంది మాలాధారణ భక్తులతో పాటు మాలాధారణ వేసుకోని వారు కూడా వున్నారు. దాసుడు వేగి హరికృష్ణ వీరికి ఇరుముడులు కట్టారు. కె.జె.పురం నుంచి వంటర్లపాలెం, మంగళాపురం, వి.ఆర్.ఆర్.పేట, చోడవరం, వెంకన్నపాలెం మీదుగా సబ్బవరం, రామపురం, వేపగుంట నుంచి సింహచలం సుమారు 69 కిలోమీటర్లు దూరం కాలినడకన వెళ్లున్నన్నట్టు మాలాధారణ భక్తులు వేగి రాము తెలిపారు. వీరికి గ్రామస్తులు హారతులు ఇచ్చి ఘనంగా వీడ్కోలు పలికారు. గత 16 సంవత్సరాల నుంచి కాలినడకన వెళ్లి స్వామి వారిని దర్శించుకుంటున్నామని రాము తెలిపారు.


కె.జె.పురం నుంచి కాలినడకన బయలుదేరి వెళ్తున్న సింహాద్రప్పన్న మాలాధారణ భక్తులు

సౌర విద్యుత్ ఎంతో మేలు

నర్సీపట్నం : సౌర విద్యుత్ వలన వినియోగదారులకు ఎంతో మేలు కూరుతుందని విద్యుత్‌శాఖ ఏఈ మనోజ్‌కుమార్ పేర్కొన్నారు. వాకర్స్ క్లబ్ ఆధ్వర్యంలో స్టేడియంలో శనివారం సోలార్ విద్యుత్‌పై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఏఈ మాట్లాడుతూ సౌర విద్యుత్ వల్ల విద్యుత్ అంతరాయాలు తగ్గుతాయన్నారు. సోలార్ విద్యుత్‌ను ఉత్పత్తి చేయడం ద్వారా విద్యుత్ ఛార్జీల భారం తగ్గడంతో పాటు మిగులు విద్యుత్‌ను ప్రభుత్వమే కొనుగోలు చేస్తుందన్నారు. దీంతో వినియోగదారులకు మేలు జరుగుతుందన్నారు. సోలార్ విద్యుత్ అమర్చుకునే వారికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రోత్సాకాలను అందిస్తున్నాయన్నారు. కాబట్టి వినియోగదారులు సౌర్ విద్యుత్ ఏర్పాటుకు దృష్టి సారించాలని కోరారు. ఈ సదస్సులో వాకర్స్‌క్లబ్ ప్రతినిధులు అల్లు అప్పారావు, నాగేశ్వరరావు, పెన్షనర్ అసోసియేషన్ అధ్యక్షులు గజ్జలమ్మ, శ్రీరామరాజు, రిటైర్డ్ డిప్యూటీ కలెక్టర్ కనకరావు పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న ఏఈ మనోజ్‌కుమార్

వైభవంగా ముగిసిన ముక్కోటి ఏకాదశి పూజలు


కల్యాణ వేంకటేశ్వర స్వామి ఆలయంలో సహస్ర దీపాలంకరణలో పాల్గొన్న భక్తులు


సత్యవరం రామాలయంలో పూజలు చేస్తున్న భక్తులు

మాడుగుల రూరల్: ముక్కోటి(వైకుంఠ ఏకదశి పర్వదినం) శనివారం తెల్లవారుజాము భజన కార్యక్రమాలతో ముగిసాయి. కె.జె.పురం జంక్షన్‌లో గల కల్యాణ వేంకటేశ్వరస్వామి ఆలయంలో వైకుంఠ ఏకాదశి పర్వదినం సందర్భంగా శుక్రవారం సాయంత్రం ఆలయ ప్రాంగణంలో సహస్ర దీపాలంకరణ కార్యక్రమం, ఆలయంలో సామూహిక భజన కార్యక్రమం నిర్వహించారు. భక్తులకు చద్ది ఏర్పాటు చేశారు. కె.జె.పురం రామాలయంలో శుక్రవారం తెల్లవారుజాము 5 గంటల నుంచి శనివారం తెల్లవారుజాము వరకు 24 గంటలు పాటు హరేరామ హరేకృష్ణ సంకీర్తన నిర్వహించారు. మండలంలో వీరనారాయణం, వీరవల్లి, తదితర రామాలయాల్లో భజన కార్యక్రమం నిర్వహించారు.

మాడుగుల: ధనుర్మాసోత్సవాలు సత్యవరం గ్రామంలో శనివారంతో ముగిసాయి. నెలగంట ప్రారంభం నుంచి శనివారం వరకు సుమారు నెల రోజులపాటు మేలుకొలుపు కార్యక్రమంలో భక్తులు తెల్లవారుజామున గ్రామంలో మేలుకొలుపు పాటలు పాడారు. హిందూ ధర్మ ప్రచారకులు తవ్వా సన్యాసిశెట్టి రామాలయంలో హైందవ ధర్మంపై భక్తులకు వివరించారు. ప్రతి ఒక్కరూ భక్తిభావం పెంచుకోవాలని సనాతన ధర్మం గురించి వివరించారు.

విద్యార్థులు అన్ని రంగాల్లో రాణించాలి

చోడవరం రూరల్ : విద్యార్థులు చదువుతోపాటు అన్ని రంగాల్లోనూ రాణించాలని, ముఖ్యంగా జనరల్ నాలెడ్జి పెంచుకోవాలని చోడవరం సీఐ పి.అప్పలరాజు ఆకాంక్షించారు. శనివారం స్థానిక ప్రేమ సమాజంలో సాకేత్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో విద్యార్థులకు వ్యాసరచన, క్విజ్ పోటీలను నిర్వహించి విజేతలకు బహుమతి ప్రదానం చేశారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథిగా పాల్గొన్న సీఐ విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడారు. విద్యార్థుల్లో దాగి ఉన్న ప్రతిభను వెలికి తీయడానికి ఇటువంటి సంస్థలు కృషి చేయడం అభినంద నీయమన్నారు. మరో అతిథిగా పాల్గొన్న డాక్టర్ బండారు సత్యనారాయణ విజేతలైన విద్యార్థులను అభినందించారు. కార్యక్రమంలో సాకేత్ ఫౌండేషన్ అధ్యక్ష, కార్యదర్శులు రాధిక, ప్రకాష్‌ల సమక్షంలో విజేతలైన విద్యార్థులకు బహుమతులను అందచేశారు. కార్యక్రమంలో భాగంగా ఫోరం ఫర్ బెటర్ చోడవరం సభ్యుడు దివంగత కృష్ణకు నివాళులు అర్పించారు. యూనివర్శిటీ ఫైన్ ఆర్ట్స్ విద్యార్థి వైకుంఠరావును ప్రోత్సహిస్తూ ఫౌండేషన్ సమకూర్చిన ఐదు వేల రూపాయల నగదు ప్రోత్సాహకం అందచేశారు. కార్యక్రమంలో ఆర్క్ సంస్థ కార్యదర్శి ప్రసాద్, ప్రేమసమాజం ప్రసాద రాజు, నడుపూరి దేముడు, రాపేటి కొండలరావు, టి.వి.రమణ, మణికంఠ పాల్గొన్నారు.


విజేతకు బహుమతి ప్రదానం చేస్తున్న సీఐ

శ్రీవిద్యలో వేడుకగా సంక్రాంతి సంబరాలు


విజేతలకు బహుమతులు అందజేస్తున్న డీఎస్పీ మోహన్


సంక్రాంతి పండగ వేడుకల్లో విద్యార్థులు, అధ్యాపకులు

నర్సీపట్నం : సంక్రాంతి పర్వదినం సమయాల్లో నిర్వహించే రంగవల్లుల పోటీలు సంప్రదాయాలకు ప్రతీకలుగా నిలుస్తాయని నర్సీపట్నం డీఎస్పీ మోహన్ పేర్కొన్నారు. నర్సీపట్నం శ్రీవిద్య కళాశాలలో శనివారం నిర్వహించిన సంక్రాంతి సంబరాలకు డీఎస్పీ ముఖ్య అతిథిగా హాజరై విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతూ శుభ్రంగా ఊడ్చి కళ్లాపుచల్లిన వాకిళ్ల ఆ వాకిళ్లలో అందంగా తీర్చిదిద్దిన ముగ్గులను మహిళలు ఎంతో అందంగా తీర్చిదిద్దుతారన్నారు. ఈ ముగ్గుల్లో గొబ్బిళ్ల, హరిదాసులు, బుడబుక్కల వాళ్లు, గంగిరెద్దుల వాళ్లు ఇలా సంక్రాంతి పండగకు ఎంతో విశిష్టత ఉందన్నారు. ముగ్గుల పోటీల్లో గెలుపొందిన విద్యార్థిని, విద్యార్థులకు ఆయన బహుమతులు అందజేశారు. టౌన్ సీఐ గోవిందరావు, కళాశాల కరస్పాండెంట్ సత్యవేణి, డైరెక్టర్ బోళెం దొరబాబు పాల్గొన్నారు.